క్లుప్తంగా

ఉచిత కోచింగ్ ప్రారంభం



కందనూలు: పట్టణంలో డిగ్రీ కళాశాలలో 'తెనుగోళ్ల విద్యావంతుల వేదిక' అధ్యక్షుడు పెబ్బేటి మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గురుకుల కోచింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యతరగతి, పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మెటీరియల్‌కు కూడా అందిస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, మండల కార్యదర్శి రాములు, గువ్వలి రాములు, సుధాకర్, లక్ష్మణ్, లక్ష్మయ్య, చెన్నకేశవులు, పంచాయతీ సెక్రెటరీ బాలరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దర్గాలో సమస్యలు పరిష్కరించాలి



కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లిలో వెలసిన ఖాజబందినవాజ్ దర్గాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. గతంలో దర్గా అభివృద్ధికి ఎనిమిది ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ భూమి కొందరు రైతులకు కౌలు ఇవ్వడంతో పలు రకాల పంటలను సాగుచేస్తున్నారు. దీంతో దర్గాకు వచ్చే భక్తులకు ఉండేందుకు స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కమిటీ సభ్యులకు తెలిసిని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా దర్గా నిర్వాహకులు నిర్లక్ష్యం వీడి ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో భక్తులుకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే నెల ఫిబ్రవరిలో నిర్వహించే ఉర్సు ఉత్సవాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

తెలకపల్లి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలోని దుందుభీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందింది. రామగిరి గ్రామానికి చెందిన మద్దెలబండ మల్లేష్, గౌరారం గ్రామానికి చెందిన వనం సాయికుమార్, నాగర్‌కర్నూల్ మండలం ఎండబెట్ల గ్రామానికి చెందిన భాషమోని జంగయ్యలు అక్రకమంగా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. గౌరారం గేటు వద్ద ట్రాక్టర్లను పట్టుకునట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుదీర్‌కుమార్ తెలిపారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి



వంగూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గణేష్‌రావు, మంద రాజేందర్ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, జంగయ్య, రాజారంగారావు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయ చైర్మన్‌కు సన్మానం



పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాసులు నియామిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదివారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దండు నర్సింహులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, దండు చంద్రయ్య, సర్పంచ్ రాములాల్, డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చంద్రయ్య, ఖాజా, బాలస్వామి, బాల్‌నారాయణ, కృష్ణయ్య, శివశంకర్ పాల్గొన్నారు.

విద్యాకమిటీ ఎన్నికలు జరిగేనా?



కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం విద్యా కమిటీలను ఏర్పాటు చేసింది. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను తప్పకుండా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. నాలుగేళ్ల కిందట విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఇప్పటికే పాత కమిటీ సభ్యులే కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఎన్నికైన చైర్మన్, కమిటీ సభ్యుల పిల్లలు ఆ పాఠశాలలో చదువులు పూర్తి చేసుకొని ఉన్నత చదువులకు వెళ్లారు. నిబంధన ప్రకారం అదేపాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులను మాత్రమే కమిటీలో ఎన్నుకుంటారు. కాని ఎన్నుకున్న సభ్యుల పిల్లలు ఉన్నత చదువులకు వెళ్లినా ప్రభుత్వం కొత్త కమిటీ ఎన్నికలు మాత్రం నిర్వహించడం లేదు.

కొత్త ప్రభుత్వంలోనైనా..

కొత్త ప్రభుత్వం కొలువుదీరి నెల రోజులు దాటిపోయిన పాఠశాలలో విద్యా కమిటీ ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యారంగం అభివృద్ధిలో కీలకమైన విద్యాకమిటీలపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో నాలుగేళ్లుగా పాత కమిటీలే కొనసాగుతున్నాయి. 2019లో ప్రభుత్వం విద్యా కమిటీలకు ఎన్నికలు నిర్వహించింది. కాలపరిమితి దాటినా ఇప్పటికి ఎన్నికలు నిర్వహించకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొదట ప్రతి 6 నెలలకు విద్యా కమిటీల కాలాన్ని పొడిగించారు. తర్వాత డిసెంబర్ 31 తేదీ వరకు పాతకమిటీ సభ్యులే కొనసాగేవిధంగా విద్యా కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం గడువు ముగియడంతో కొత్త ప్రభుత్వం విద్యా కమిటీ ఎన్నికలకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సభ్యులు వీరే..

విద్యాకమిటీలో సభ్యులుగా ఆ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులను ఎంపిక చేస్తారు. వీరితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎక్స్‌అఫిసియో సభ్యుడిగా ఉంటారు. ఒక్కో తరగతికి ముగ్గురు చొప్పున విద్యార్థుల తల్లిదండ్రులను కమిటీ సభ్యులుగా ఎన్నుకుంటారు. జనరల్ కేటగిరి నుంచి ఒకరు, ఎస్సీ, ఎస్టీల నుంచి ఒకరు, బీసీ, మైనార్టీల నుంచి మరొకరిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. ముగ్గురు సభ్యులలో కనీసం ఇద్దరు మహిళలు ఉండాలి.

కమిటీ బాధ్యతలు

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ బాధ్యతలు స్కూళ్ల పర్యవేక్షణ చేయాలి. మధ్యాహ్న భోజన పథకం, అల్పాహారం ఇతర సంక్షేమ కార్యక్రమాలను శ్రద్ధ తీసుకోవాలి. ప్రతి నెల సమావేశం నిర్వహించి పాఠశాలలో మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులతో చర్చించాల్సి ఉంటుంది.

ప్రభుత్వం స్పందించాలి



విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే అవకాశం లేక విద్యా వ్యవస్థ కుంటుపడుతోంది. విద్యా కమిటీల ఏర్పాటుతో పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు అవకాశం ఉంటుంది. వెంటనే కొత్తగా ఎన్నికలు నిర్వహించాలి.

–రవి, మార్చాల

నిర్లక్ష్యం తగదు



స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలపై నిర్లక్ష్యం సరికాదు. నాలుగు సంవత్సరాలుగా కమిటీల పొడిగింపుతో పాఠశాలల్లో సమస్యలు అధికం అయ్యాయి. పాత కమిటీలో ఉన్న తల్లిదండ్రుల పిల్లలు ప్రస్తుతం పాఠశాలలో చదవడం లేదు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఎస్ఎంసీ ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలి.

–లింగం, రఘుపతిపేట

అయోధ్య అక్షింతల పంపిణీ



కల్వకుర్తిలో అక్షింతలను పంపిణీ చేస్తున్న విశ్వ హిందూ పరిషత్ నాయకులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని పలు కాలనీలలో ఆదివారం అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. ముఖ్య కూడళ్లలో కాషాయ తోరణాలను ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం దేవాలయాల్లో పూజలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తునట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రముఖ్ గిరిధర్‌రెడ్డి, ఆంజనేయులు, దుర్గాప్రసాద్, వివేకానంద, అక్షర శ్రీను పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని సీతారామ చంద్రాస్వామి దేవాలయంలో అయోధ్య అక్షింతలకు అగ్రహారం సర్పంచ్ ప్రశాంత్ నాయక్, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం నుంచి గ్రామస్తులు ర్యాలీగా ఇంటింటికి వెళ్లి అక్షింతలను వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు తదితరులు ఉన్నారు.

నత్తనడకన అదనపు గదుల నిర్మాణం



అసంతపూర్తిగా పాఠశాల నిర్మాణ పనులు

తాడూరు: మండలంలోని ఇంద్రకల్‌లో పాఠశాల అదనపు గదుల నిర్మాణం నత్తనడకన కొనసాగుతోంది. మన ఊరు మన బడి పథకంలో భాగంగా చేపట్టిన అదనపు గదుల కోసం నిధులు మంజూరు అయ్యాయి. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. దాదాపు ఏడాదికి పైగా కావొస్తున్న పనులు పూర్తి కాలేదు. అసంపూర్తిగా పనులు చేసి వదిలేశారు. నిధుల కొరత కారణంగా పనులను నిలిపివేసినట్లు కాంట్రాక్టర్ తెలిపారు. దీంతో పాఠశాల నిర్వహణ ఇబ్బందికరంగా ఉందని ప్రస్తుతం ఉన్న గదులు శిథిలావస్థకు చేరాయని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆగిన నిర్మాణ పనులను పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హనుమాన్ ఆలయాలు ముస్తాబు



వెల్దండ పెద్దాపూర్‌లో విద్యుత్ కాంతులతో హనుమాన్ ఆలయం



తెలకపల్లిలో..

వెల్దండ: వెల్దండ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని హన్‌మాన్, శివాలయాలు, తదితర దేవాలయాలను సోమవారం నిర్వహించే అయోధ్య ఉత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అయోధ్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఆలయాలకు లైట్లతో ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్య గ్రామపెద్దలు, భక్తులు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఆదివారం హనుమాన్, రామాలయ దేవాలయాలను శుభ్రం చేసి అలంకరించారు. ఇళ్ల ముంగళ్లలో ముగ్గులు వేసుకుని గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టుకుని, దీపాలు వెలిగించి అక్షతలను తలపై వేసుకోవాలని అయోధ్య ట్రస్టు సభ్యులు కోరారు. నరేంద్రాచారి, సురేష్ పాల్గొన్నారు.

మల్లురవికి అభినందనలు

అచ్చంపేట రూరల్: టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవిని ఢిల్లీలో అధికార ప్రతినిధిగా ప్రభుత్వం నియమించడంపై పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు అభినందనలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో మల్లురవిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బిక్కుమాండ్ల మనోహర్, చంద్రమోహన్, రాజేష్ తదితరులు ఉన్నారు.

ఎంపికపై హర్షం

మన్ననూర్: మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవిని ఢిల్లీలో అధికార ప్రతినిధిగా ఎంపిక చేయడంపై ఆదివారం కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, వెంకటరమణ, హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా నాగర్ కర్నూల్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం మల్లురవికి కల్పించాలని వారు కోరారు.

చీరలే పంటకు రక్షణ



తాడూరు: పంటలు కాపాడుకోవడం రైతులు చీరలను రక్షణగా ఏర్పాటు చేసుకుంటున్నారు. యాసంగిలో సాగుచేసిన వేరుశనగ, మొక్కజొన్న పంటలకు అడవి పందుల బెడద అధికం అయ్యిందని రైతులు వాపోయారు. దీంతో పంటల రక్షణ కోసం పంటల చుట్టు చీరలను కట్టి అడవి పందుల బెడద నుంచి కాపాడుకుంటున్నారు. చీరలు కొనుగోలు చేసి పంటల చుట్టూ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయా గ్రామాల రైతులు తెలిపారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావుకు వినతి

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి టికెట్ ఇవ్వాలని ఉస్మానియా యూనివర్సిటీ తెలంగాణ ఉద్యమకారుడు, న్యాయవాది మారేడు ఈశ్వర్ ఆదివారం ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం ఎంతో కృషి చేశానని వివరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

వెల్దండ: రోడ్డు నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ సోమనర్సయ్య హెచ్చరించారు. ఆదివారం కొట్రచౌరస్తాలో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవర్లు ఇష్టానుసారంగా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రైవర్లకు, కూలీలకు రోడ్డు నిబంధనపై అవగాహన కల్పించారు. వాహనదారుడు లైసెన్స్, ఆర్సీలు తదితర పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐ బదిలీ

వెల్దండ: మండల కేంద్రంలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ బదిలీ అయ్యారు. గద్వాల జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు అధికారులు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు.

కొల్లాపూర్: పట్టణంలో ఎస్‌ఐగా పనిచేస్తున్న జి.బాలవెంకటరమణ బదిలీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆయన సెలవులపై వెళ్లారు. ఈ క్రమంలోనే ఆయనను జోగులాంబ గద్వాల జిల్లా సీసీఎస్ విభాగానికి బదిలీ చేస్తున్నట్లు ఆదివారం డీఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థికసాయం



అచ్చంపేట రూరల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గుర్రం దశరథం కుటుంబ సభ్యులకు ఆదివారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బీచ్యా నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అండగా ఉంటామన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పీఆర్‌టీయూ నిరంతరం పాటు పడుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రాంచందర్‌రావు, సురేందర్ రెడ్డి, మల్లికార్జున్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు హక్కు కలిగి ఉండాలి



వెల్దండ: అర్హులందరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలో ఏర్పాటు చేసిన 35 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికి ఓటుహక్కు పొందే విధంగా బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ శంకర్‌నాయక్, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

నేడు బైక్ ర్యాలీ

కొల్లాపూర్: పట్టణంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు భజరంగ్‌దళ్ నాయకులు పురేందర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్ని దేవాలయాల నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. రామాలయం, మాధవస్వామి దేవాలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సాయంత్రం నిర్వహించే ఊరేగింపులో భక్తులు పాల్గొనాలని కోరారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాధరావుపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని మాధరావుపల్లి సర్పంచ్ సునీత అన్నారు. ఆదివారం వైద్య శాఖ, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొజెక్టర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రదర్శించారు. ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్ యోజన, స్వచ్ఛభారత్, పీఎం స్వానిధి, ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, పెన్షన్లు వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు, కార్యదర్శి శ్రీరాం, ఏఎన్‌ఎం సుమిత్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్లు

తాడూరు: మండలంలోని ఇంద్రకల్, యత్మాతాపూర్, తుమ్మలసూర్, కుమ్మెర మీదుగా నాగర్‌కర్నూల్, బిజినేపల్లి మండల కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రోడ్డు నిర్మించి దశాబ్దం గడిచినా మరమ్మతుకు నోచుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మలుపులు కూడా ప్రమాదకరంగా ఉన్నాయని వాపోయారు. పేరుకే ఆర్‌అండ్‌బీ రోడ్డు అయినప్పటికి ఎటువంటి సూచిక బోర్డులు లేకపోవడం, మరమ్మతు చేయకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



యత్మాతాపూర్ బీటీరోడ్డు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

బల్మూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబవివరాలను అడిగి తెలుసుకున్నారు. 24 ఏళ్ల తరువాత తమ గురువులను, స్నేహితులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంబురపడ్డారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం రాంసింగ్, పూర్వ ఉపాధ్యాయులు తిరుపతిరావు, అర్జున్‌రావు, రేవతిరెడ్డి, పాల్గొన్నారు.

డొంకదారులు లేక రైతుల ఇక్కట్లు



ఇరుకుగా ఉన్న ఎమిరెడ్డిపల్లి డొంకదారి



వెంకటేశ్వర్లబావికి ఇలా..

అమ్రాబాద్: వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు డొంకదారులు సక్రమంగా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డొంకదారులు ఎగుడు దిగుడుగా, రాళ్లు, చెట్లు దట్టంగా ఉండటంతో ముందుకు వెళ్లేందుకు వీలు లేని దుస్థితి నెలకొంది. మండలంలోని తిర్మలాపూర్(బీకే), గ్రామ పడమర వైపు పొలాలకు వెళ్లేందుకు దారిలేదు. జంగంరెడ్డిపల్లిలో తూర్పు డొంక, నేర్లవాగు, కల్ములోనిపల్లిలో డొంకలు ఇరుకుగా ఉన్నాయి. పెద్దవాగుపై నిర్మించిన కల్వర్టు పూర్తిగా ధ్వంసమవడంతో కుమ్మరోనిపల్లిలో పొలాలకు వెళ్లేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. వెంకటేశ్వర్లబావిలో పొలాలకు వెళ్లే డొంకదారి అధ్వానంగా మారింది. ఎమిరెడ్డిపల్లి డొంక ఇరుకుగా ఉండటంతో పంటపొలాల వెంట వెళ్తే రైతులు అడ్డుకుంటూ ఘర్షణకు దిగుతున్నారని ఆయా గ్రామాల రైతులు వాపోయారు. అధికారులు స్పందించి డొంక దారులు బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలి

మన్ననూర్: ఎమ్మెల్యే వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పంబలి బుచ్చయ్య, హరినారాయణ, కొయ్యల శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే రికార్డు స్థాయిలో అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే వంశీకృష్ణ గెలుపొందారని పేర్కొన్నారు. 25 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారని వివరించారు. మంత్రి పదవి ఇచ్చి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆకాంక్షను నెరవేర్చాలని పేర్కొన్నారు. సీనియర్లకు సముచిత స్థానం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ

పెద్దకొత్తపల్లి: మండలంలోని గంట్రావ్‌పల్లిలో చాకలి ఐలమ్మ, శ్రీకాంతాచారి విగ్రహాల ఏర్పాటు కోసం ఆదివారం గ్రామస్తులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లోజి అరవిందాచారి మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటు కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

